క్లుప్తంగా

సమ్మేటివ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: 2025–26 విద్యా సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం సమ్మేటివ్ అసెస్మెంట్–1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో యాదయ్య సూచించారు. అక్టోబర్ 24నుంచి 31వరకు పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం పరీక్షలు జరపకుంటే పాఠశాలలపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

కోటపల్లి: మండలంలోని నాగంపేట గ్రామ శివారులో అటవీ పందులు బీభత్సం సృష్టించి చేతికందిన పత్తిపంటలను పూర్తిగా నాశనం చేశాయని నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని బుధవారం కోటపల్లి ఫారెస్టు అధికారులకు, వ్యవసాయాధికారి సాయికృష్ణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు దుర్గం బక్కయ్య, మంద రవి, అధికారులు పాల్గొన్నారు.

దండారీ దర్బార్‌కు ఏర్పాట్లు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సల్పాల వాగు వెంకటాద్రి ఆలయం సమీపంలో ఆదివాసీల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే దండారీ దర్బార్ కార్యక్రమానికి ఆదివాసీలు ఏర్పాట్లు పూర్తి చేశారు. సంస్కృతి సంప్రదాయాల ప్రకారం డోలు వాయిద్యాలతో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జెండా విష్కరణ కార్యక్రమం నిర్వహించారు. చింతగూడ గ్రామస్తులు, దండారీ దర్బార్ నిర్వహణ సభ్యులు పాల్గొని రాత్రి సమయానికి మండల పరిధిలో గల దండారీలు ఉన్న గ్రామాల ప్రజలు ఇక్కడకు చేరుకోనున్నట్లు తెలిపారు.

పశువైద్య శిబిరాలు ప్రారంభం

కాసిపేట/వేమనపల్లి: ఈ నెల 15నుంచి నవంబర్14వరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలు, పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేయనున్నట్లు పశువైద్యులు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోలని కోరారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లిలో, వేమనపల్లి మండలం మంగనపల్లిలో బుధవారం పశువైద్యశిబిరం నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. కాసిపేటలో మండల పశువైద్యాధికారి సరిత, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సంతోశ్, గోపాలమిత్ర శ్యాం, శ్రీనివాస్, నారాయణ, వేమనపల్లిలో పశువైద్యాధికారులు సుప్రియ, పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

చెన్నూర్/లక్సెట్టిపేట/పాతమంచిర్యాల: బీసీ రిజర్వేషన్ల కోసం ఈ నెల 18న బీసీ సంఘాల జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ నాయకులు డాక్టర్ నీలకంఠేశ్వర్ రావు, వడ్డేపల్లి మనోహర్, నరెండ్ల శ్రీనివాస్, కొండయ్య, ఎల్లన్న, రమణాచారి, రాజేష్, వంశీ, చెన్నూర్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, లక్సెట్టిపేటలో కళ్యాణం రవి, అంకతి కిషన్, నడిమెట్ల రాజన్న, రాజగురువయ్య, రాజలింగు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో దొంగతనం

లక్సెట్టిపేట: పట్టణంలోని మహాలక్ష్మీవాడలో తాళం వేసి ఉన్న రెండిళ్లలో దొంగతనం జరిగినట్లు స్థానిక ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. లింగయ్య అనే వ్యక్తి ఈ నెల 13న ఇంటికి తాళం వేసి నస్పూర్‌కు వెళ్లాడు. బుధవారం ఇంటికొచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి, బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో దాచి ఉంచిన సుమారు 2తులాల పావు బంగారం, 10తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇదే కాలనీకి చెందిన సరళ అనే మహిళ మంగళవారం జగిత్యాలకు వెళ్లింది. బుధవారం ఇంటికొచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని అరతులం బంగారం కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై తమ సిబ్బందితో కలిసి దొంగతనం జరిగిన రెండు ఇళ్లను సందర్శించి చోరీ జరిగి న తీరును పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ సభ్యత్వ నమోదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో ఐఎన్‌టీయూసీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు కలిసి సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం కార్మికుల సమస్యలపై మాట్లాడారు. పీఎల్ఆర్ బోనస్‌ను పెంచి ఇప్పించడంలో ఐఎన్‌టీయూసీ ఎంతగానో కృషి చేసిందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, బ్రాంచ్ నాయకులు బ్రహ్మాచారి, మహేష్ రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణికుల చింత



కోటపల్లి: మండలంలోని ఎసన్‌వాయి ఎడగట్ట గ్రామాల మధ్య కోటపల్లి మండలకేంద్రానికి వెళ్లే రహదారిపై అడుగుకో గుంతతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఎసన్‌వాయి, ఎడగట్ట, పిన్నారం, పార్‌పల్లి గ్రామాలకు వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కోటపల్లి, చెన్నూర్ మండలకేంద్రానికి వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలనైనా పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొత్త లైన్ వేశారు.. కనెక్షన్ మరిచారు



భీమారం: మండలంలోని దాంపూర్‌లో ఇళ్ల ముందు నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌కి నెలలు గడుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ ఇవ్వడం లేదు. విద్యుత్ లైన్‌ను ఇళ్లపై నుంచి తొలగించి, ఇళ్ల ముందు నుంచి వేయాలని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులు, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మూడు నెలల క్రితం గ్రామానికి కొత్తగా స్తంభాలు తరలించి, కొత్త లైన్ నిర్మించి అనంతరం వాటికి తీగలు కూడా బిగించారు. కానీ పాత లైన్‌కి ఉన్న కనెక్షన్‌ని తొలగించి కొత్త లైన్‌కి కలిపేందుకు అధికారులు తాత్సారం చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని కొత్త స్తంభాలకు కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు.

డ్రైయినేజీల్లో పూడిక తీశారు..



సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మురికి కాలువలు పూడిక తీయకపోవడంతో మురికి నీరంతా రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు ఈ దుస్థితిపై 'కంపు కొడుతున్న కాలనీలు' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం అయ్యింది. ఎంపీవో అజ్మత్ అలీ వెంటనే స్పందించి ఆయా గ్రామాల్లో మురికి కాలువల పూడిక తీయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. దీంతో గంగారంలో పంచాయతీ సిబ్బందితో పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ మురికి కాలువల్లో పూడిక తీయించారు.

అడుసుతొక్కందే అడుగేయలేం..!





కోటపల్లి: మండలంలోని ఎడగట్ట గ్రామంలోని వ్యవసాయ పనులకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. గ్రామస్తులకు చెందిన పంటపొలాలు, చేన్లకు వెళ్లాలంటే ఈ దారిగుండానే పోవాల్సి వస్తుందని, దీంతో వ్యవసాయపనులకు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలు జరిగి కాళ్లు, చేతులు విరిగిన ఘటనలు ఉన్నాయని వాపోయారు. ఇటీవల రోడ్డు బాగు చేయించాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయించి రైతులను ఆదుకోవాలని ఎడగట్ట గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం నిల్వల పరిశీలన



రికార్డులను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

కోటపల్లి: మండలకేంద్రంలోని చౌకధరల బియ్యం గోదాంను బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌక ధరలకు సరఫరా అయ్యే బియ్యం నిల్వలను పరిశీలించి గోదాంలోని స్టాక్‌ను సరిచూశారు. రిజిస్టర్‌లో ఉన్న బియ్యం నిల్వలు, సరఫరా చేసిన బియ్యం నిల్వలు సక్రమంగా ఉన్నాయో, లేదో చూసి బియ్యం నాణ్యతను పరిశీలించారు. గోదాంలో నిల్వ ఉన్న పాత బియ్యం వివరాలు, వాటి నాణ్యత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లో ప్రస్తుతం ఉన్న వివరాలు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

నెన్నెల: తహసీల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ సందర్శించి తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూ భారతి, సాధాబైనామాల పురోగతిపై తహసీల్దార్ పిప్పిరి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. నెన్నెల శివారులోని సర్వే నం.671, 672లో అటవీ, రెవెన్యూ వివాదంపై ఆరా తీశారు. ఆ భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట డీటీ ప్రకాష్, ఆర్ఐ సులోచన, సర్వేయర్ దశరథం ఉన్నారు.

ఫారెస్ట్ మేనేజర్‌ను బదిలీ చేయాలని ధర్నా



ఎస్టీపీపీ గేటు ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

భీమారం: జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వేధిస్తున్న ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణిని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికులు ప్లాంట్ గేటు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మేరకు హెచ్ఎంఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ విక్రమ్ మాట్లాడుతూ.. ప్రతిరోజు 200నుంచి 300మీటర్లు పనిచేయాలని భారం మోపుతూ, పనిచేయని కార్మికులకు వార్నింగ్ లెటర్లు జారీ చేస్తున్నారన్నారని ఆరోపించారు. వర్షాలు పడితే పనులు బంద్‌చేసి జీతాలు ఇవ్వకపోవడం, పనికి వచ్చినా మాస్టర్ ఇవ్వకపోవడం లాంటి చర్యలతో కార్మికులు తీవ్రంగా మనస్తాపానికి లోనవుతున్నారన్నారు. ధర్నా అనంతరం జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, చిప్పకుర్తి సంపత్, నవీన్ లు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ చట్టాన్ని తీసుకురావాలి

పాతమంచిర్యాల: పార్లమెంట్‌లో బీసీల 42 శాతం రిజర్వేషన్‌కు చట్టం తీసుకురావాలని సీపీఐ, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు వనం సత్యనారాయణ, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నరెండ్ల శ్రీనివాస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ రోజే మెడికల్ కార్డు



ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సంస్థలో పనిచేసే ఉద్యోగులు రిటైర్మెంట్ అయిన రోజే వారికి హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులను క్లైమ్‌లను త్వరగా సెటిల్ చేసినందుకు పర్సనల్ డిపార్టుమెంట్ ఉద్యోగులను బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్ కుమార్, టింబర్ యార్డ్ ఇన్‌చార్జి రాజేశ్, డీవైపీఎం రాజేశ్, కిరణ్ కుమార్, సీనియర్ పీవో కాంతారావు, మురళి, సురేందర్ పాల్గొన్నారు.

'క్లైమ్‌లను పెండింగ్‌లో పెట్టొద్దు'



అధికారులతో మాట్లాడుతున్న హరి పచౌరి

శ్రీరాంపూర్: సీఎంపీఎఫ్ క్లైమ్‌లను పెండింగ్‌లో పెట్టొద్దని ఆ శాఖ రామగుండం రీజినల్ కమిషనర్ –1 హరి పచౌరి తెలిపారు. శ్రీరాంపూర్ సీఎంపీఎఫ్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం సీఎంపీఎఫ్ 3వ ప్రయాస్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ కేసులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎక్కడ జాప్యం లేకుండా కంపెనీ నుంచి పంపించే వివరాలను త్వరితగతిన పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ కమిషనర్–2 గోవర్ధన్, శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సీనియర్ పీవో కాంతారావు, అకౌంట్స్ అధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గుడిపేటలో గర్భిణులకు సీమంతం

చెన్నూర్‌రూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారంతో తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట రైతువేదికలో బుధవారం మంచిర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ స్థాయి పోషణమాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు, కిశోర బాలికలకు విధిగా పోషకాహారం అందించేలా చూడాలని స్పష్టంగా తెలియజేశారు. ఫుడ్‌స్టాళ్లను పరిశీలించిన అనంతరం జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, సీడీపీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించగా, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో మనోరమ, ఎంపీడీవో మోహన్, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్, ఏసీడీపీవో శ్రావణి, సూపర్‌వైజర్స్ కవిత, మాధవి, సువర్ణ, పద్మ, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ నగేష్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణతో ఉత్పత్తి సాధించాలి



కాసిపేట 2గనిపై జీఎం రాధాకృష్ణ, అధికారులు

కాసిపేట: మార్కెట్లో పోటీకి అనుగుణంగా ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా భూగర్భ పని స్థలాలు పరిశీలించి ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గైర్హజరు శాతాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏరియా ఐఈడీ కిరణ్‌కుమార్, గని మేనేజర్ లక్ష్మినారాయణ తదితరులున్నారు.

17న జాబ్ మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మెరీనా పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 2190ఉద్యోగాల కోసం ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ చదివిన పురుష, మహిళ అభ్యర్థులు 18నుంచి 40సంవత్సరాలలోపు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. సంబంధిత కంపెనీలో అడ్మిన్ మేనేజర్, అకౌంట్స్, టెలికాలర్స్, స్టోర్ ఇన్‌చార్జి, హెచ్ఆర్ టీమ్, డేటా ఎంట్రీ, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, సెక్యూరిటీ గార్డు, డ్రైవర్లు, ఆఫీస్ సబార్డినేట్స్, రికవరీ టీమ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ప్రొడక్షన్ సూపర్‌వైజర్, మెటీరియల్ డిస్‌పాచ్ తదితర పోస్టులు ఉన్నాయని, మంచిర్యాల, కరీంనగర్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



వేమనపల్లి: మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావ్

కోటపల్లి/వేమనపల్లి: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. కోటపల్లి, మల్లంపేట, వేమనపల్లి మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీల్వాయిలో రికార్డులను పరిశీలించారు. వాటర్ సరఫరా రిజిష్టర్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు. సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించి తడి, పొడి చెత్త వేరుచేయాలన్నారు. కోటపల్లి మండలం మల్లంపేటలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, రికార్డులను పరిశీలించి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కోటపల్లి గ్రామపంచాయతీని పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని చెత్తాచెదారంతో నిండిపోవడం, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని కార్యదర్శి సందీప్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి ఇద్దరు కార్యదర్శులపై చర్యలకై సిఫార్సు చేయాలని ఎంపీవో అక్తర్‌ను డీపీవో నారాయణరావు ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు స్పందించారు.. చెత్త తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



మంచిర్యాలటౌన్: మంచిర్యాల 'కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ చెత్త కుప్పలే' అనే శీర్షికన ఈ నెల 15న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించారు. కార్యాలయం సమీపంలోని చెత్త కుప్పలన్నింటినీ తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజల కు చెత్త కుప్పలు దర్శనం ఇవ్వకుండా, ఎప్పటికప్పుడు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మూడు రేషన్‌షాపుల సీజ్



పాతమంచిర్యాలలోని రేషన్ షాపును సీజ్ చేస్తున్న సివిల్ సప్లై అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని మూడు రేషన్ షాపులను సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ టీం ఓఎస్డీ ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేయగా, కొన్ని దుకాణాల్లో మాత్రమే పీడీఎస్ బియ్యం పంపిణీ జరుగుతున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. తనిఖీలు జరుగుతున్నట్లు తెలుసుకున్న మూడు రేషన్ దుకాణదారులు, ఆయా దుకాణాలను మూసేసి, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి వెళ్లిపోయారని, ఆయా దుకాణాలను సీజ్ చేశామని, చట్టరిత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పాతమంచిర్యాలలోని బి.మహేందర్, అంజలి, చున్నంబట్టివాడలో సుదమల్ల శోభరాణి డీలర్లకు చెందిన షాపుల్లో దొడ్డు బియ్యం 29.29 కిలోలు, సన్నబియ్యం 27.35కిలోలు తక్కువగా ఉన్నట్లు గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏఎస్‌వో కె.సుదర్శన్ రెడ్డి, ఎస్సై శ్రీనివాసరావు, డీటీలు మురళి, భూమేశ్‌లు పాల్గొన్నారు.

భీమారంలో కుక్కల పట్టివేత

భీమారం: మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైందని ప్రజలు మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కుక్కలు పట్టేవారిని పిలిపించారు. ఒక్కో కుక్కకు రూ.300 చొప్పున ఖరీదు చేయగా, తనవంతుగా రూ.5000 ఇచ్చి, ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. దీంతో బుధవారం కుక్కల పట్టివేత కార్యక్రమం మొదలైంది. ఆ కుక్కలను వాహనాల్లో తీసుకెళ్లి అడవుల్లో వదిలిపెట్టేందుకు వారు అంగీకరించారు.

ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్

లక్సెట్టిపేట: స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని లక్సెట్టిపేట మండలంలోని కొత్త కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రెంక సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో బుధవారం రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండేళ్లుగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో, గ్రామపాలన మరుగున పడిందన్నారు. దీనిపై రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మంచిర్యాల ఐఎంఏకు అవార్డు

మంచిర్యాలటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ ఏటా ఇచ్చే అవార్డుకు ఐఎంఏ మంచిర్యాల ఎంపికైనట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పూజారి రమణ, డాక్టర్ అనిసెట్టి విశ్వేశ్వర రావులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను చేపట్టిన పలు కార్యక్రమాలకు ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డును మంచిర్యాల ఐఎంఏ పొందిందని, నవంబర్ 2న కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు.

• రిజర్వేషన్ కేటాయించాలి

దండేపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో తొలగించిన ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ కేటాయించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ల రాజమల్లు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్ట సవరణ ఉద్యమానికి దళితులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

• 108లో ప్రసవం

నెన్నెల: కుమురంభీం జిల్లా చింతలమానేపల్లికి చెందిన పంచపూల అనే మహిళకు బుధవారం సాయంత్రం పురుటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108సిబ్బంది మంచిర్యాల ఎంసీహెచ్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యన పురుటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108అంబులెన్స్ సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. అంబులెన్స్‌లో పంచపూల మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని నెన్నెల ఈఎంటీ రాజేశ్వరి, పైలెట్ తిరుపతి తెలిపారు. 108సిబ్బందిని ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు.

• గీత కార్మికుడికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామానికి చెందిన బొంగాని శంకర్‌గౌడ్ అనే గీత కార్మికుడు మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఈత చెట్టుపై నుంచి జారి కింద పడిపోగా తీవ్ర గాయాలపాలయ్యాడు. అస్వస్థతతో ఉ న్న శంకర్‌గౌడ్‌ను కుటుంబ సభ్యుల సహకారంతో స్థానిక గీత కార్మికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు.

• ఎన్‌హెచ్ 63 రోడ్డు భూముల రీసర్వే

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని జాతీయ రహదారి 63(ఎన్‌హెచ్) కింద భూములు కోల్పోయిన వారి అభ్యర్థన మేరకు భూముల రీసర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, భూములు కోల్పోయిన వారు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రోడ్డు కింద భూములు కోల్పోయి ఇబ్బంది పడుతున్న వారు సంబంధిత భూపత్రాలతో వారం రోజుల్లో మందమర్రి తహసీల్దార్ ఆఫీస్‌లో సంప్రదించి వారి ఇబ్బందులు తెలియజేయాలని పేర్కొన్నారు.

• మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రమేష్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే 5 గనిపై బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. మెడికల్ బోర్డ్ జాప్యం వల్ల చాలామంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం కార్మికులను కలిసి సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు ఉన్నారు.

సోలార్ తీగలు చోరీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల్లో ముగ్గురు రైతులు అడవి పందులు పంట చేలను నాశనం చేయకుండా చుట్టూ సోలార్ ఫెన్షింగ్ తీగ అమర్చుకున్నారు. కాగా ఆ సోలార్ ఫెన్షింగ్ తీగ, ఒక బ్యాటరీ బుధవారం చోరీకి గురైంది.